ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి గీతారెడ్డి

మొయినాబాద్, ఏప్రిల్ 30 : ఎరువుల దుకాణాల డీలర్లు రైతులకు ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారిణి గీతారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలోని మొయినాబాద్ రైతు వేదికలో ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌ను ఆమె పర్యవేక్షించారు. శాస్త్రవేత్తలు వ్యవసాయ పంటల సాగు కోసం అందజేస్తున్న సమాచారంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మండల కేంద్రంలో ఉన్న వివిధ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల విక్రయ, నిల్వల రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఎరువుల కొరత లేదని, రైతులకు కావాల్సిన ఎరువులను అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రైతులకు ఎరువులు విక్రయించినప్పుడు రసీదు ఇవ్వడంతో పాటు ఎరువులు విక్రయించిన తరువాత ఈ-పాస్ మిషన్‌లో నమోదు చేయాలని డీలర్లకు సూచించారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే డీలర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారితో పాటు మండల వ్యవసాయ అధికారిణి రాగమ్మ, ఏఈవోలు కుమార్, సునీల్, రైతులు పాల్గొన్నారు.

లీగల్ సెల్ కన్వీనర్‌గా విజయ్‌నాయక్

యాచారం, ఏప్రిల్30: భువనగిరి పార్లమెంట్ లీగల్‌సెల్ కన్వీనర్‌గా మండలంలోని తక్కళ్లపల్లితండాకు చెందిన న్యాయవాది జర్పుల విజయ్‌నాయక్‌ను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ రామారావు మంగళవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భువనగిరి లీగల్‌సెల్ కన్వీనర్‌గా నియమించినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. తోటి న్యాయవాదులు సన్మానించారు.

మోదీ సర్కారును గద్దెదింపాలి

కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

యాచారం, ఏప్రిల్ 30: కార్పొరేట్ శక్తులకు కొమ్ముగాస్తున్న మోదీ ప్రభుత్వాన్ని లోక్‌సభ ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి. అంజయ్య అన్నారు. మండలంలోని ధర్మన్నగూడ గ్రామంలో మంగళవారం ఆయన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల పట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణిని వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రధాని మోదీ దేశ ప్రజల కంటే కార్పొరేట్ సంస్థలకే పెద్ద పీట వేస్తున్నారని మండిపడ్డారు. దేశ సంపదను అదాని, అంబానీల చేతుల్లో పెడుతున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులేస్తుందన్నారు. నల్లధనాన్ని వెలికితీసి పేదల ఖాతాల్లో వేస్తానన్న మోదీ ..అదే నల్లధనం కూడబెడుతున్న బడాబాబుల చేతుల్లో కీలు బొమ్మగా మారారని ఎద్దేవా చేశారు. దేవుళ్ల పేరుతో, మతం పేరుతో దేశంలో చిచ్చు రేపుతున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కోరారు. కార్యక్రమంలో వ్య.కా.స నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

- కాసాని గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి
- ప్రజలకు రేవంత్‌రెడ్డిపై నమ్మకం పోయింది
- మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారు
- బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబుయాదవ్
- జిల్లా వ్యాప్తంగా గులాబీ శ్రేణుల ప్రచారం

మొయినాబాద్‌లోని నక్కలపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబుయాదవ్

షాబాద్ : సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబుయాదవ్

షాబాద్, ఏప్రిల్ 30: చేవెళ్లలో కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబుయాదవ్ అన్నారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలో జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి, ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి మీద ప్రజలకు అపనమ్మకం ఏర్పడిందని చెప్పారు. తెలంగాణలో మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కొంత మంది నాయకులు పార్టీని వీడినంతా మాత్రన ఎలాంటి నష్టం ఉండదని చెప్పారు. బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలని సూచించారు. జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ పాలనలో ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గతంలో అదునుకు రైతుబంధు వచ్చేదని, కల్యాణలక్ష్మి, రైతుబీమా వంటి పథకాలు సకాలంలో రాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. షాబాద్ మండలం నుంచి కాసాని జ్ఞానేశ్వర్‌కు భారీ మెజార్టీ ఇస్తామని చెప్పారు. సమావేశంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, మండల కో-ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, డైరెక్టర్లు సూదా యాదయ్య, దేవేందర్‌రెడ్డి, నాయకులు యాదిరెడ్డి, బచ్చుంగారి నారాయణరెడ్డి, పాండురంగారెడ్డి, రాంచంద్రారెడ్డి, పర్వేద నర్సింహులు, వెంకటేశ్‌గౌడ్, కారు చెన్నయ్య, ప్రతాప్‌రెడ్డి, రాజూగౌడ్, భూపాల్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మునీర్, ఇనాయత్, నరేశ్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

మొయినాబాద్ : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని, బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబుయాదవ్ అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా మొయినాబాద్ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం నక్కలపల్లి, ఎతుబార్‌పల్లి, తోలుకట్టా, సాయంత్రం కేతిరెడ్డిపల్లి, చాకలిగూడ, ఎన్కేపల్లి, జీవన్‌గూడ గ్రామాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేదని, కాంగ్రెస్ పాలనలో కోతలు తప్పడం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ఆ పార్టీ నేతలను నిలదీయాలన్నారు. అదే విధంగా ఎన్కేపల్లి, జీవన్‌గూడ గ్రామాల్లో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కుమ్మరి రాము, కుమ్మరి శ్రీనరి వాస్, బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు ప్రమీల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాలె శ్రీకాంత్, మాజీ సర్పంచ్‌లు శ్రీహరియాదవ్, స్వప్న, బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి నర్సింహ, ఉపాధ్యక్షుడు జయవంత్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ బిలాల్, మాజీ ఎంపీటీసీలు మాణిక్‌రెడ్డి, రవీందర్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు దారెడ్డి వెంకట్‌రెడ్డి, డప్పు రాజు, మీడియా సెల్ మండల కన్వీనర్ సుభాష్, నాయకులు అంజయ్యగౌడ్, వెంకటయ్య, ప్రవీన్‌రెడ్డి, రాఘవేందర్‌యాదవ్, రాజు, శంకర్, తిరుపతిరెడ్డి, డేవిడ్ పాల్గొన్నారు.

చేవెళ్ల రూరల్ : ఊరెళ్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నంరూరల్ : ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను ఎంపీ ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు మద్దతుగా మండల పరిధిలోని కప్పాడు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఎంతో పాటుపడే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉడుతల జలంధర్‌గౌడ్, దేవదాసు, వీరయ్య, మల్లారెడ్డి, యాదగిరిరెడ్డి, జంగిలి, శంకర్, శివ, శ్రీనివాస్, మల్లయ్య తదితరులున్నారు.

గ్రామాల్లో బీఆర్ఎస్ విస్తృత ప్రచారం

షాద్‌నగర్‌రూరల్ : ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాలు, తండాలు, నియోజక వర్గం అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటు వేసి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చేవెళ్ల రూరల్ : ఊరెళ్ల, మొండివాగు గ్రామాల్లో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దొళ్ల ప్రభాకర్, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శివప్రసాద్, బీఆర్ఎస్ బీసీసెల్ మండల అధ్యక్షుడు ఎదిరె రాములు, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు శేరి శివారెడ్డి, వ్యసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివనీల తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే లక్ష్యం

కడ్తాల్, ఏప్రిల్ 30 : పేద ప్రజలను ఆదుకోవడమే రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని కడ్తాల్ జడ్పీటీసీ, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ దశరథ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రానికి చెందిన మంగల్‌పల్లి మహేశ్ ఇంటి నిర్మాణానికి రూ.11 వేల విలువ గల 30 సిమెంట్ బస్తాలను ట్రస్టు తరపున అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ, బాల కృష్ణ, నరేశ్, పవన్, అంజి, సురేశ్, మహేశ్, రాజశేఖర్, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా దళితులను నియమించాలి

తుర్కయాంజాల్, ఏప్రిల్ 30: సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిత్వ శాఖను దళితులకు కేటాయించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను మోసం చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి కోండ్రు పురుషోత్తం అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధి ఇంజాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 30 : బాటసింగారం రైతు సేవా సహకార సంఘంలో సభ్యులై అకాల మరణం పొందిన వారి కుటుంబానికి తమ వంతు సాయంగా ఆర్థిక సాయం అందజేస్తున్నామని చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ యాదవ్ తెలిపారు. లష్కర్‌గూడ గ్రామానికి చెందిన రైలు ఎడ్ల నర్సింహ 08.11.2017లో చనిపోయాడు. ఆయన కుమారుడు ఎడ్ల సీతారామ్ మండల కేంద్రంలోని సంఘం ప్రధాన కార్యలయంలో మంగళవారం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ యాదవ్ రూ. 15 వేల చెక్కును అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం

యాచారం : మండలంలోని కుర్మిద్ద గ్రామంలో గ్రామానికి చెందిన పంతం మధు తన సొంత డబ్బుతో బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి అనిల్‌రెడ్డి, వైద్యులు విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రయాణికులు, ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్‌కు ఓట్లడిగే నైతిక హక్కులేదు

- బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 30: ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లడిగే నైతిక హక్కు లేదని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలో రైతు సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పలువురు నాయకులు బీజేపీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపీ అభ్యర్థిగా ఉన్న రంజిత్‌రెడ్డి చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందే పౌష్టికాహారంతో పాటు కోడిగుడ్లలో అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, నాయకులు శర్వ లింగం, కృష్ణ, శంకర్‌గౌడ్, వెంకట్ రాంరెడ్డి, శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల మల్లేశ్

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 30 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల మల్లేశ్ తెలిపారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి అధ్యక్షతన అంబేద్కర్ భవన్ లో పార్లమెంట్ సీపీఐ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది ఏండ్లుగా మోదీ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తూ దేశాన్ని అధోగతి పాలు చేసిందన్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని సవాలు విసిరారు. ప్రతి భారతీయ కుటుంబానికీ రూ.15 లక్షల చొప్పున డబ్బును వారి బ్యాంకు ఖాతాలో వేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలరాజు, రంగారెడ్డి జిల్లా సీపీఐ కార్యదర్శి జంగయ్య, వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, పండిట్ సీపీఐ జిల్లా నాయకులు ప్రభులింగం, పుస్తకాల నర్సింగ్‌రావు, గోపాల్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, దత్తు నాయక్, చందునాయక్, వడ్ల సత్యనారాయణ, పార్టీ చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శి మగ్బుల్, శంకర్‌పల్లి కార్యదర్శి సుధీర్, మొయినాబాద్ కార్యదర్శి శ్రీనివాస్, షాబాద్ కార్యదర్శి జంగయ్య, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, ఏఐటీయూసీ మండల నాయకులు శివయ్య, యాదగిరి ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 30 : లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సెక్టార్ అధికారి రమావత్ శ్రీనివాస్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మంగళవారం ఖానాపూర్ గ్రామంలో ఓటరు స్లిప్పులను ఇంటింటికీ తిరిగి అందజేశారు. కార్యక్రమంలో జంగయ్య, మల్లయ్య న్నారు.

పెద్దఅంబర్‌పేట : ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల సెక్టోరియల్ అధికారి జ్యోతి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని వివిధ కాలనీల్లో ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. మున్సిపల్, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటరు స్లిప్పులు అందజేశారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు.

మంచాల : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సెక్టార్ అధికారి, పంచాయతీ రాజ్ ఏఈ సాయినాథ్ గౌడ్ అన్నారు. మంచాల గ్రామంలో బూత్‌లెవల్ అధికారులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి ఓటరు స్లిప్పులను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలని ఆదిబట్ల ఎస్ఐలు వెంకటేశ్, రాజు అన్నారు. మంగళవారం ఎంపీపటేల్‌గూడ, బొంగళూరు గ్రామాల్లో ఆదిబట్ల పోలీసులు, కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. -ఆదిబట్ల, ఏప్రిల్ 30

పదిలో సత్తాచాటిన ప్రభుత్వ విద్యార్థులు

- ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలు
- విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 30 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో వెలువడిన పదోతరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ సత్తాచాటారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులు ఉత్తీర్ణతను సాధించారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ పాఠశాలకు చెందిన శశాంక్ 10/10మార్కులు సాధించాడు. మరో ముగ్గురు విద్యార్థులు 9.7మార్కులు సాధించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, ఎంఈవో సన్మానించారు.

ఇబ్రహీంపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో 10/10 మార్కులు సాధించిన విద్యార్థి శశాంక్

షాబాద్ : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో షాబాద్ మండలంలో 73.52 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ తెలిపారు. మండలంలో మొత్తం 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఒక మాడల్ పాఠశాల, ఒక కేజీబీవీ పాఠశాలల్లో కలిపి మొత్తం 423 మంది విద్యార్థులు ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలు రాయగా, ఇందులో 311 మంది విద్యార్థులు పాసయ్యారు. కేజీబీవీ పాఠశాలలో 32 మంది విద్యార్థులు అందరూ పాసయ్యారు. తెలంగాణ మాడల్ పాఠశాలలో 97 మందికి 91మంది, పాసయ్యారు. కేజీబీవీ పాఠశాలలో అనూష అనే విద్యార్థిని 9.5జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

షాద్‌నగర్‌టౌన్ : మండలంలోని బూర్గుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చంద్ర శేఖర్ 9.8జీపీఏ, మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నిఖిత 9.5 సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పలువురు అభినందించారు.

పెద్దఅంబర్‌పేట : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. పెద్దఅంబర్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గాయత్రీ మనోశ్రీ 9.5 జీపీఏతో సత్తాచాటింది. విద్యార్థినులు హరిణి, తేజస్వినిలు 9.2 జీపీఏ మార్కులు సాధించారు. ఇంగ్లిష్ మీడియంలో 60 మంది విద్యార్థులకు 76.7 శాతం మంది, తెలుగు మీడియంలో 17 మంది విద్యార్థులకు 58.8 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు రామచంద్రారెడ్డి తెలిపారు.

తుర్కయాంజాల్ : మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కొహెడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని టి దీక్షిత 10 జీపీఏకు 9.8, రాగన్నగూడ ప్రభుత్వ పాఠశాలకు చెందిన టి దుర్గాలక్ష్మి 10 జీపీఏకు గాను 9.8 జీపీఏను సాధించింది. వీరితో పాటు పలువురు విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు.

యాచారం: మండలంలోని 10 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలో కలిపి మొత్తం 500 మంది విద్యార్థులకు 386 మంది విద్యార్థులు ఉత్తీర్ణతను సాధించారు. నందివనపర్తిలో అత్యధికంగా 94 శాతం ఉత్తీర్ణత సాధించగా, కుర్మిద్దలో అత్యల్పంగా 55 శాతం ఉత్తీర్ణత సాధించారు.

81 శాతం ఉత్తీర్ణత

అబ్దుల్లాపూర్‌మెట్ : మండలంలోని అబ్దుల్లాపూర్, బండరావిరాల, కవాడిపల్లి, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. అనాజ్‌పూర్ 95.4 శాతం, బాటసింగారం 97.7 శాతం, ఇంజాపూర్ 94 శాతం, కొహెడ 89.8 శాతం, కుంట్లూర్ 69 శాతం, మజీద్‌పూర్ 97శాతం, తొర్రూర్ 83 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో వెంకట్‌రెడ్డి తెలిపారు. బాటసింగారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని జక్క మేఘన10/10 సాధించింది.

88శాతం ఉత్తీర్ణత

మంచాల : పదో తరగతి ఫలితాలను విద్యాశాఖ మంత్రి మంగళవారం విడుదల చేయడంతో మంచాల ప్రభుత్వ పాఠశాలలో 88శాతం ఉత్తీర్ణత నమోదయింది. మండలంలోని వివిధ జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి 388మంది పరీక్షలు రాయగా, అందులో 342మంది ఉత్తీర్ణత సాధించారు. మంచాల జిల్లా పరిషత్ పాఠశాలలో 41మందికి 31, ఆరుట్ల 46మందిలో 41, జాపాల 22గానూ 19, లోయపల్లి 38గానూ 34, మంచాల బాలికల పాఠశాలలో 17మందికి గానూ 11మంది, తాళ్లపల్లిగూడ 18మందికి 16, పెరికిరాళ్ల తండా 15మందికి గానూ 15, లింగంపల్లి 8మందికి 6, చెన్నారెడ్డిగూడ 16మందికి 11, రంగాపూర్ 28మందికి 25, ఆరుట్ల ఆదర్శపాఠశాలలో 95 మందికి గానూ 85మంది, కేజీబీవీ మంచాల పాఠశాలలో 44మందికి 39మంది ఉత్తీర్ణులయ్యారని ఇన్‌చార్జి ఎంఈవో వెంకట్‌రెడ్డి తెలిపారు.

చేవెళ్లటౌన్ : తెలంగాణ చేవెళ్ల మాడల్ స్కూల్ విద్యార్థులు మండల టాపర్లుగా నిలిచారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 511 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 451 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 74మంది పరీక్ష రాయగా, 73 మంది ఉత్తీర్ణత సాధించారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో 38 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 37 మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో తెలిపారు. చేవెళ్ల తెలంగాణ మాడల్ స్కూల్ విద్యార్థులు వి.జ్యోత్స్న, సాయిమనోజ్ఞలు 10 జీపీఏతో మండల టాపర్‌గా నిలిచారు.

ఆదిబట్ల : ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 37 మంది పరీక్షలు రాయగా, 33 మంది విద్యార్థులు పాసయ్యారు. కొంగరకలాన్ గ్రామానికి చెందిన మణిదీప్‌చారి విద్యార్థి 10 జీపీఏ సాధించాడు. మరో విద్యార్థిని జి.శ్రీవల్లి 9.5 జీపీఏ సాధించింది. బొంగుళూరు మాడల్ పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు కల్యాణి, బి.సౌమ్య, ఎండీ టబుకం, మొహన్ హేమంత్, టి విద్యాసాగర్‌రెడ్డి లు 9.5 జీపీఏ సాధించారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య

- మండల పరిధిలోని మక్తమాదారం గ్రామ సమీపంలో ఘటన
- పెట్రోల్ పోసి తగులబెట్టిన వైనం

కడ్తాల్, ఏప్రిల్ 30: గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మక్తమాదారం గ్రామ సమీపంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... కడ్తాల్-షాద్‌నగర్ ప్రధాన రహదారిపై మక్తమాదారం శివారులోని ఓ వెంచర్‌లో సోమవారం రాత్రి సుమారు 45 ఏండ్లు వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని, దుండగులు దారుణంగా హత్య చేసి.. గుర్తు పట్టకుండా ఉండేందుకు మృతదేహాన్ని పెట్రోల్ పోసి తగులబెట్టారు. మంగళవారం ఉదయం వెంచర్‌లో మృతదేహాన్ని చూసిన స్థ